క్లుప్తంగా

నిత్యాన్నదాన సంస్థకు విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ నిత్యాన్నదాన సంస్థకు కోవెలకుంట్ల గ్రామానికి చెందిన కరిమద్దుల గోపాలకృష్ణుడు రూ. 40 వేలు విరాళం అందజేశారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కరిమద్దుల గోపాలకృష్ణుడు విరాళం మొత్తాన్ని అందజేసినట్లు ఆలయ ఈఓ రామాజన్ ఆదివారం తెలిపారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో మూడు ప్రాంతాల్లో కేపీ శైలజ జ్ఞాకార్థం వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించారు. ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం జీవిబెట్లు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, చింతలాయిపల్లె రోడ్డు వద్ద మొత్తం పది సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు.

పరామర్శ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన యాపర్ల సుంకిరెడ్డి భార్య యాపర్ల రామ సుబ్బమ్మ (85) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆకుమల్లకు చేరుకొని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, కొవెలకుంట్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బీబీ నాగార్జున్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, కొవెలకుంట్ల మాజీ మండల అధ్యక్షుడు బీవీ ప్రసాద్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, ఆకుమల్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి బుగ్గన

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం డోన్ పట్టణంలోని ఇందిరానగర్ అంజనేయస్వామి గుడి నుంచి రూ.19.5 కోట్లతో వెంకటాపురం గ్రామం వరకు నిర్మించిన నాలుగులైన్ల రహదారిని ప్రారంభించనున్నారని రాష్ట మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేషులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఈ రోడ్డు వెంట పాదయాత్ర నిర్వహించి గుమ్మకొండలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. రూ.2కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

పట్టణంలో కార్తీక వనభోజనాలు

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట మఠంలో మండల గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అలాగే శిరిడీ సాయి కల్యాణ మండపంలో కమ్మ సంఘం డోన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నం వెంకట కృష్ణారెడ్డి, పోలూరి రాఘవరావు ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు.

కోలుకోలేక మహిళ మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం గ్రామానికి చెందిన సుజాత(23) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు బనగానపల్లెకు చెందిన సుజాతను మూడేళ్ల కిందట బేతంచెర్ల మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన చెన్నయ్యతో వివాహం చేశారు. గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈనెల 24న ఉదయం ఇంట్లోని పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలుకు తరలించారు.

మంత్రి బుగ్గన పర్యటనను విజయవంతం చేయండి

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం, నాగమల్లకుంట గ్రామాల్లో మంగళవారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. మంత్రి బుగ్గన పర్యటన నేపథ్యంలో ఆదివారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రహిమానుపురం సర్పంచ్ ప్రమీలమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డితో ఏర్పాట్లపై చర్చించారు. మంగళవారం ఉదయం రహిమానుపురం గ్రామం నుంచి నాగ మళ్ల కుంట గ్రామం వరకు రూ.3.56 కోట్లతో వేసిన రహదారిని ప్రారంభించి పాదయాత్రగా గ్రామం చేరుకుంటారన్నారు. అదేవిధంగా గ్రామంలో రూ.22 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును మంత్రి ప్రారంభిస్తారన్నారు.

విద్యుత్ సరఫరాలో రెండు రోజుల అంతరాయం

డోన్ టౌన్ : మల్యాల సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నేపథ్యంలో సోమ, మంగళవారాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదన్నారు. యాపదిన్నె ఫీడర్ కింద వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి 10 గంటల వరకు, మల్యాల, కటారుకొండ ఫీడర్ల కింద మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

- డబుల్ రోడ్డుతోపాటు హెల్త్ క్లినిక్, సచివాలయ భవనాలను ప్రారంభించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- కొత్తరోడ్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి మంత్రి పాదయాత్ర



రూ. 5.75 కోట్లతో వేసిన గుడిపాడు రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

ప్యాపిలి: పల్లెల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల పల్లెలకు సైతం మౌలిక వసతులు కల్పిస్తున్నారని, ప్రత్యేకించి ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రోడ్లను అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో రూ. 5.75 కోట్లతో వేసిన ప్యాపిలి-గుడిపాడు డబుల్ రోడ్డును ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన కొత్త రోడ్డుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి 10 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు గ్రామీణ రహదార్ల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నాలుగున్నరేళ్లలో డోన్ నియోజకవర్గంలో దాదాపు అన్ని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామని తెలిపారు. నియోజకవర్గంలో ఇంటింటికి శుద్ధజలాన్ని అందించాలన్న సంకల్పంతో రూ.300 కోట్లతో చేపడుతున్న గోరుకల్లు రిజర్వాయర్ వాటర్ గ్రిడ్ పనులు తుదిదశకు చేరాయన్నారు. చెరువులకు నీరు నింపే కార్యక్రమాన్ని ఇటీవలే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేత ప్రారంభించామని, ఇక నియోజకవర్గంలో తాగు, సాగు నీటికి ఢోకా ఉండదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రచారార్భాటాలకు దూరంగా ఉంటూనే శాశ్వత అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ పేదల జీవితాల్లో సంతోషాన్ని అందిస్తున్నామని తెలిపారు. మరికొన్నినెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు ఆచరణ సాధ్యమవ్వని హామీలతో ప్రజల ముందుకు వస్తారని, వారి మోసకారి హామీలను నమ్మొద్దని కోరారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజులర్‌రహిమాన్, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, వైద్యాధికారిణి వాణిశ్రీ, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి, గుడిపాడు, ప్యాపిలి సర్పంచ్‌లు శ్రీనివాసులు, లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, గుడిపాడు ఎంపీటీసీ రాగుల వెంకటరామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, అలేబాదు బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిపాడు పుల్లారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, రాజామురళీకృష్ణ, రామచంద్రారెడ్డి, శ్యాంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్, మస్తాన్ ఖాన్, కొండయ్య, బషీర్, బోరెడ్డి రఘు, ప్రేమసాగర్ రెడ్డి, ప్రవీణ్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేజ్‌క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో మంత్రి

విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయం ప్రారంభం

గుడిపాడు నుంచి ప్యాపిలి వరకు పాదయాత్ర చేసిన అనంతరం మంత్రి ప్యాపిలిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కిందిగేరిలో రూ. 21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. కొద్దిసేపు వైద్య సిబ్బందితో ముచ్చటించారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయం వెనుక రూ. 43. 6 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం వెంగళాంపల్లి చెరువు వద్ద నిర్మిస్తున్న టూరిజం అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, ఆమదాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట వేళల్లో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. నంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలోని విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ఆల్వకొండ, ముక్కమల్ల, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, ఎగ్గోని, కానాల, అక్కం పల్లె, గిద్దలూరు, లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె మంగపల్లె, ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 1 గంటల వరకు, పేరుసోముల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ఫీడర్లకు 5 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

సంక్షేమం, అభివృద్ధి... వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయి



కోవెలకుంట్ల చేరిన వైఎస్సార్‌సీపీ అభిమానుల పాదయాత్ర

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనులు 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బసవరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బసవరావుతోపాటు పార్టీ అభిమానులు ఇసాక్, వరుసద్దరావు, విజయ్, సుంకన్న, ప్రకాశం, ధర్మ తదితరులు పాదయాత్ర చేపట్టారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఈ నెల 17వ తేదీ నుంచి చేపట్టిన పాదయాత్ర ఆదివారం కోవెలకుంట్లకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకుని నవరత్న పథకాలతో వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలో సైతం పథకాలను కొనసాగించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు.

అ'పూర్వ' కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కోవెలకుంట్ల: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఒక వేదికపై చేరారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, బీచయ్య, సుదర్శన్, ఖాజావలి, జగదీశ్వరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారాయుడు, చెన్నకేశవరెడ్డి, పద్మావతి, ప్రసన్న, లక్ష్మీదేవి, కోటమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనులకు అండగా ఉంటాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : శాలివాహనులకు అండగా ఉంటామని, ఐకమత్యంగా మెలగాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నేత కాటసాని ఓబులరెడ్డి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన శాలివాహనుల వనభోజనం కార్యక్రమానికి ఓబులరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సురేష్ బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కాటసాని ఓబుల రెడ్డి మాట్లాడారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం యాగంటి క్షేత్రంలో శాలివాహన కులస్తులకు కమ్యూనిటీ భవనం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించామని గుర్తు చేశారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ విద్యలో రాణించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.10వేలు అందిస్తామన్నారు. శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ శాలివాహనులు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివరామ్, నాగరాజు, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్ : పట్టణంలోని తారక రామనగర్‌లో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనలో లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన శివ,హేమంత్ అనే ఇద్దరికి గాయాలు కాగా ఇంకో స్కూటరిస్టుకి మూగి దెబ్బలు తగిలాయి. క్షతగాత్రులను డోన్‌లో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కేఈ కుటుంబం సహకారంతో ఎదిగి వెన్ను పోటు!

డోన్ టౌన్ : గతంలో కేఈ కుటుంబ సహకారంతో జెడ్పీ చైర్మన్ పదవి అలంకరించిన ప్రస్తుత జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్.... కేఈ కుటుంబానికే వెన్ను పోటు పొడుస్తున్నాడని కేఈ వర్గం నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కేశన్నగౌడ్, డోన్, ప్యాపిలి మాజీ ఎంపీపీలు టీఈ శేషఫణిగౌడ్, తొప్పల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు చిట్యాల మద్దయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు అలిబాద్‌తాండ పరమేష్, గోసానిపల్లె శ్రీరాములు, ఉడుములపాడు ఆదినారాయణ ధ్వజమెత్తారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు హోదాలో ఆయన వ్యవహరించిన తీరును ఆదివారం మధు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఖండించారు. పార్టీ నిబంధనల ఉల్లంఘన అంటున్న మల్లెల రాజశేఖర్ టీడీపీ కార్యాలయంలో కాకుండా చంద్రపల్లె నాగేశ్వరరావు యాదవ్ ఇంట్లో నిర్వహించడాన్ని ఏమంటారని ప్రశ్నించారు. ఇది పార్టీ ఉల్లంఘన కాదా అని నిలదీశారు. నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ తదితర నియోజకవర్గాల్లో అసమ్మతి వర్గాలు స్వయాన లోకేష్ ఎదుట కొట్టుకున్నా ఏలాంటి నిర్ణయాలు తీసుకోలేని నేతలు డోన్ టీపీ నాయకులపై మాత్రమే ప్రతాపం చూపిస్తూ బర్తరఫ్ చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కనీసం సర్పంచ్‌గా కూడా గెలవని వ్యక్తిని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించడం సరైంది కాదని, ఇప్పటి వరకు సైకిల్ గుర్తుకు ఓటు వేయని ధర్మవరం సుబ్బారెడ్డికి సీటు ఏలా కేటాయిస్తారని నిలదీశారు. సుబ్బారెడ్డి తెరచాటు రాజకీయాలు ఎవరికి తెలయవన్నారు. మళ్లీ జనవరి 1న నూతన సంవత్సరం వేడుకలు కూడా కేఈ ప్రభాకర్‌తో డోన్‌లో ఘనంగా నిర్వహించి తమ సత్తా చాటుతాం అని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చంద్రపల్లె ఆదారి,జలదుర్గం రమణ, శేఖర్, నాగన్న, ధర్మారం సంజీవుడు, యాపదిన్నె రంగన్న, పెద్దయ్య, బాలుడు, అశోక్, చంద్రగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ దీపోత్సవం



అఖండ దీపోత్సవంలో పాల్గొన్న పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



లక్ష దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, భక్తులు

బనగానపల్లె రూరల్ : యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అఖండ దీపోత్సవం(ఆకాశ మహాదీపోత్సవం) ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ పశ్చిమ దిశలో ఎర్రమల కొండలపై అఖండ దీపాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ దంపతుల తోపాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అఖండ దీపాన్ని వెలిగించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా లక్ష దీపోత్సవం

క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష దీపోత్సవం ఘనంగా జరిగింది. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మ, కుటుంబ సభ్యులు, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, సోదరుని కుమారుడు కాటసాని రమాకాంత్‌రెడ్డి దీపాలు వెలిగించి ఉమామహేశ్వరస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, శ్రీ ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ ఉపాధ్యక్షులు దస్తగిరెడ్డి, సభ్యులు రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పూదోట ఆశ్రమం, చెన్న కేశవ స్వామి ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, జ్వాలా తోరణాలు వెలిగించారు. శివ పార్వతులను పల్లకీలో ఊరేగించారు. అదేవిధంగా శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, వేదపండితుల ఆధ్వర్యంలో కార్తీక దీపాలు వెలిగించారు. హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు భజన కృష్ణయ్య, అర్చకుడు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ఆలయంలో ఆకాశ దీపం, కార్తీక పౌర్ణమి దీపాలు వెలిగించారు.


కొలిమిగుండ్ల: కార్తీక పౌర్ణమి వేడుకలను ఆదివారం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో భజన మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిని ప్రత్యేక పల్లకీలో గ్రామంలోని వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు ఆలూరి నరసింహప్రసాద్, రాఘవేంద్రప్రసాద్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉయ్యాల సేవ నిర్వహించారు. ఎస్ఐ రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారవిభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డితో పాటు గ్రామ పెద్దలు అశేష భక్త జనం మధ్య జ్వాలాతోరణం వెలిగించారు.

బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన,అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పల్లకీలో ఆసీనులుగావించి పల్లకీసేవ సహస్ర దీపాలంకరణ సేవ, ఉయ్యాల సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

భక్తి శ్రద్ధలతో శ్రీకేధారేశ్వరస్వామి వ్రతం

డోన్ టౌన్ : కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి రోజు నిర్వహించుకునే శ్రీ కేధారేశ్వర స్వాముల వ్రతాన్ని (గౌరీ నోములు) భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీకేధారేశ్వరస్వామి వ్రతం ప్రాముఖ్యత, ఆచరించే పద్ధతులను వివరించారు.







బేతంచెర్లలో జ్వాలా తోరణాలను వెలిగిస్తున్న భక్తులు,సహస్రదీపాలంకరణ సేవలో శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు, జ్వాలాతోరణం వెలిగిస్తున్న దృశ్యం

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



బేతంచెర్ల: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ, నగర పంచాయితీ చైర్మన్



అంబేద్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనందరావు, అధ్యాపకులు కిశోర్‌కుమార్, వీరన్న, వెంకటేశ్వరరెడ్డి, మురళి, నాగేశ్వరరెడ్డి, లైబ్రేరియన్ కృష్ణుడు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంధాలయ అధికారి బషీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డోన్ : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ప్రాముఖ్యతను ఈ సందర్భంగా ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, ఆర్ట్ రమణ, దారా హరినాథ్‌రెడ్డి, మౌలాబీ, ఫాతిమాబీ, నాయకులు ఆర్ఈ రాజవర్ధన్, పెద్దయ్య, మిట్టా రవికుమార్, మహేంద్రనాయుడు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ స్టేట్ డైరక్టర్ ముర్తుజావలి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు ఖాజా హుసేన్, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



అంబేద్కర్,రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

- ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి. చిత్రంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చింతలాయిపల్లెలో ఆదివారం వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వీరికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం రూ.21.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాలని కోరారు. గతంలో ఎవరూ ఇలా ప్రతి ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందాయా?మీఅవసరాలు ఏంటి అని అడిగి తెలుసుకున్న దాఖలాలు లేవన్నారు. నాలుగున్నరేళ్లలో చేసిన మేలు గురించి వివరించేందుకు ధైర్యంగా ప్రతి గుమ్మం వద్దకు వస్తున్నామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఎన్నికలు త్వరలో రానుండటంతో టీడీపీ నాయకులు భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. గతంలో విద్య, వైద్య రంగాల తీరు ఎలా ఉండేది... ప్రస్తుత పరిస్థితిని గమనించాలని కోరారు. టీడీపీ హయాంలో పింఛన్‌లు తీసుకోవాలన్నా నానా అవస్థలు పడాల్సి వచ్చేదని, అవ్వతాతలు పంచాయితీ కార్యాలయాలు గంటల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఉండేదన్నారు. జగన్ సీఎం అయ్యాక సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారు జామునే ఇంటి తలుపుతట్టి పింఛన్ సొమ్ము అందిస్తున్నారని, ఇది దేశ చరిత్రలో ఎక్కడా అమలు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కారసాకుల లక్ష్మీనారాయణ, ఎంపీపీ నాగవేణి, ఎంపీడీఓ సాయికృష్ణ, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, కొప్పుల నారాయణరెడ్డి, నీలం సంజీవకుమార్‌రెడ్డి, అంబటి విజయ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జయరామకృష్ణుడు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.